క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని నదిచాగి గ్రామ ప్రాథమిక కన్నడ పాఠశాల విద్యార్థులకు సోమవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు శ్రీధర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. వాలీబాల్, రింగ్‌బాల్, క్రికెట్ బ్యాట్, క్లిప్పింగ్‌లను సమకూర్చారు. ప్రధానోపాధ్యాయుడు గురురాజ్‌శెట్టి, ఉపాధ్యాయులు పర్వీన్, ఈరమ్మ ఆయనను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో చిన్న మొహర్రం



కొలువుదీరిన చిన్న పీర్లు

మంత్రాలయం రూరల్: మండలంలోని వగరూరు గ్రామంలో చిన్నమొహర్రంను గ్రామస్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. చావిడిలో కొలుదీదిన పీర్లకు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు.

గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోనిరూరల్/ఆదోనిఅర్బన్ : మాల మహానాడు కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదోనిలో సోమవారం గద్దర్ సంతాప సభను నిర్వహించారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాల మహానాడు కర్నూలు జిల్లా అధ్యక్షుడు మహానంది గద్దర్ సేవలను గుర్తు చేశారు. ఆస్పరి మండల కన్వీనర్ భరత్, అంబేడ్కర్ నగర్ కన్వీనర్ నరసింహులు, కై రుప్పల ఈరన్న, బసవరాజు, మాలమహానాడు ఆలూరు తాలూకా స్టూడెంట్ యూనియన లీడర్ హరికృష్ణ, విజయ్ పాల్గొన్నారు. అలాగే.. మాలమహానాడు పట్టణాధ్యక్షులు బొబ్బిలి, రాలయసీమ అధ్యక్షులు ఎం.నరసప్ప, జిల్లా అధ్యక్షులు జైభీమ్‌సాయిరామ్.. అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీపీఐ మండల కార్యదర్శి ఎన్నిక

హొళగుంద: సీపీఐ మండల కార్యదర్శిగా పెద్దహ్యాటకు చెందిన బోయ మారెప్ప, సహాయ కార్యదర్శిగా రంగన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. ఆస్పరిలో జరిగిన సాధారణ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆధ్వర్యంలో హొళగుంద మండల కమిటీని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ సీపీఐ సిద్ధాంతాలను పాటిస్తూ కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగ, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

కర్ణాటక బస్సుల రద్దుతో ఇబ్బందులు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం బళ్లారి, సిరుగుప్ప డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను సోమవారం ఆయా డిపోల అధికారులు రద్దు చేశారు. దీంతో సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హొళగుందకు బళ్లారి నుంచి రెండు, సిరుగుప్ప డిపో నుంచి ఒక బస్సు రాకపోకలు సాగించేవి. హొళగుంద–మార్లమడికి వరకు 5 కి.మీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో బస్సులు దెబ్బతింటున్నాయని ఆ డిపో మేనేజర్లు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డ్రైవర్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి బస్సుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో నూతన గెస్ట్‌హౌస్ పనులు

ఆలూరు: రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో ఆలూరులో రూ 3.50 కోట్లతో గెస్ట్‌హౌస్ భవన నిర్మాణం ప్రారంభించనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ అనీఫ్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరడంతో కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. నూతన గెస్ట్ హౌస్ సకల హంగులతో నిర్మిస్తామని, ప్రహరీ, వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి

హాలహర్వి: పాడిరైతులు పశుపోషణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి అశోక్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక పశు వైద్యశాలలో మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామాల్లోని పాడి రైతులకు పశువులు, గొర్రెలు, మేకలకు రోగనిరోధక శక్తిని పెంచే మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. పశువులకు జ్వరం, ఆయాసం వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు.

తల్లిపాలు.. అమృతం

- ముర్రుపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి
- బిడ్డకు పాలివ్వడంతో తల్లికీ లాభం
- పాలతో చిన్నారులకు సంపూర్ణ పోషకాలు
- ముగిసిన వారోత్సవాలు



బాలింతలు, గర్భిణులకు పోషక కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి (ఫైల్)

కోసిగి: బిడ్డకు జన్మనిచ్చిన తల్లితో ఆ బిడ్డ బంధం బలపడాలంటే మార్గమొక్కటే.. పాలివ్వడం. భూమిపైకి వచ్చిన క్షణం నుంచి పసిగుడ్డు వెదికేది తల్లిపాలనే. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రపాలు తాపితే ఆరోగ్యంతో పాలు బలవర్ధకం, వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుంది. అందుకే తల్లిపాలను అమృతంతో సమానంగా భావిస్తారు. ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. బిడ్డకు తొలి ఆహారం తల్లిపాలు. ఇది ప్రకృతి వరం . దీనికి మరేది సాటి రాదు. ఆధునిక కాలంలో కొందరు తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వకుండా దూరం చేస్తున్నారు. దీంతో బిడ్డ ఎదుగుదలకు దూరం చేయడంతో పాటు ఏటా శిశు మరణాల సంఖ్య పెరిగిపోతోంది. ఈ మేరకు గర్భవతులకు , బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారికి తల్లిపాల లాభాలను వివరిస్తున్నారు.

251 అంగన్‌వాడీ కేంద్రాలు..

ఐసీడీఎస్ మంత్రాలయం సెక్టార్ పరిధిలోని కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి, మంత్రాలయం మండలాల్లో మొత్తం 251 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిల్లో గర్భిణులు 3,385 మంది, బాలింతలు 3,463 మంది, 3–5 సంవత్సరాల లోపు పిల్లలు 7,317 మంది, 7 నెలలు నుంచి 3 ఏళ్ల లోపు 17,306 మంది చిన్నారులు ఉన్నారు.

ముర్రుపాలు వ్యాధినిరోధక శక్తి పెంపు..

పుట్టిన శిశువుకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాపిస్తే బిడ్డలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులను నివారించే ఔషధ గుణాలు తల్లిపాలలో ఉంటాయి. బిడ్డ బరువు, ఎదుగుదలకు ఇది దోహద పడుతోంది. పగటి పూట ఇచ్చే పాలు కన్నా రాత్రి సమయంలో పాలు పట్టించడం ద్వారా బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతోందని స్త్రీ శిశు సంక్షేమ అధికారులు పేర్కొంటున్నారు. పుట్టిన నాటి నుంచి 6 నెలల వరకు తప్పసరిగా తల్లి పాలు మాత్రమే పట్టించాలని చెబుతున్నారు.

ప్రభుత్వ సహకారం..

గర్భిణులు, బాలింతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రతి నెల వారికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అందులో నెలకు సరిపడ..3 కేజీల బియ్యం, కేజీ బేడలు, అరలీటర్ నూనె, 2కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల చిక్కీలు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల కర్జూరలను అందిస్తున్నారు.



తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎమ్ భాగ్యమ్మ

ఆదోనిఅర్బన్: నియోజకవర్గంలో 215 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పట్టణంలో 126, రూరల్‌లో 89 కేంద్రాలు ఉన్నాయి. అందులో గర్భిణులు 3,196 మంది ఉన్నారు. పట్టణంలో 1691, రూరల్‌లో 1505 ఉన్నారు. బాలింతలు 2,623 మంది ఉండగా రూరల్‌లో 1261 మంది, పట్టణంలో 1462 మంది ఉన్నారు. 0–3 సంవత్సరాల్లోపు 23,777 మంది శిశువులు ఉండగా, అందులో పట్టణంలో 11,840, రూరల్‌లో 11,937 మంది ఉన్నారు.

పట్టణంలో ప్రత్యేకంగా జరగలేదు..

సీడీపీఓ లేకపోవడంతో పట్టణంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాలు నిర్వహించలేదు. అర్బన్ సీడీపీఓ ఉమామహేశ్వరి పట్టణానికి రెగ్యులర్‌గా చేయడంతో పాటు కర్నూలు ఇన్‌చార్జ్‌గా కొనసాగించారు. ఎప్పుడో ఒకసారి ఆదోనికి రాకపోకలు సాగిస్తుండటంతో వారోత్సవాలు కేవలం అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రమే జరిపించారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని, శిశువుకు మొదటి ఆరు నెలలు తల్లి పాలను మాత్రమే ఇవ్వాలని, డెలివరీకి వచ్చిన గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా ఆస్పత్రిలోని తాము అవగాహన కల్పిస్తున్నాం. సాధారణ ప్రసవం, సిజేరియన్ ఆపరేషన్ అయితే తల్లిపాలు ఎలా పట్టించాలో వారికి వివరిస్తున్నాం.

– మాధవీలత, స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రి సూపరింటెండెంట్

ఇంటి వద్దకే కిట్టు అందించారు



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఇంటి వద్దకే వచ్చి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును ఒక బ్యాగులో వేసి అందజేశారు. ప్రభుత్వం అందించిన సరుకులు అన్నీ బాగా ఉన్నాయి. పౌష్టికాహారంతో కూడి సరుకులు ఇవ్వడం సంతోషం. నెలకు సరిపడ వస్తువులు అందించారు.

– శాంతి, కోసిగి

ముర్రుపాల అవశ్యకత వివరిస్తున్నాం



ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతల సమావేశం నిర్వహించి తల్లిపాల వారోత్స వాలు నిర్వహించాం. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టించాలి. ఈ సందర్భంగా ముర్రుపాల ప్రత్యేకతను వారికి వివరిస్తున్నాం. పౌష్టికాహారం తీసుకునే విధానం, ఆరోగ్య సలహాలు ఇస్తున్నాం.

– హెప్సిబా రాణి, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్

ప్రతి నెల పరీక్షలు చేస్తున్నాం



గర్భం దాల్చిన నాటి నుంచి నెల కొకసారి రక్త పరీక్షలు చేయించి ఆరోగ్య సలహాలు ఇస్తున్నాం. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశాలతో బిడ్డ బరువులను చెక్ చేసి హిమోగ్లోబిన్ శాతం పెరిగేలా చూస్తున్నాం. బిడ్డకు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారు.

– మనోజ్‌కుమార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, కోసిగి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్ : ఆర్‌సీఎం పాఠశాల వద్దనున్న 33కేవీ ఎస్కేడీ ఫీడర్‌లో రెండు ఇంటర్‌నెట్ 11 మీటర్ల పోల్స్ తొలగించే పనులు చేపట్టనున్నందున మంగళవారం పట్టణంతో పాటు రూరల్, కౌతాళం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పురుషోత్తం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీ1, డీ3 పరిధిలో ఉండడం వల్ల జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు ఎత్తుగా ఉండడంతో స్తంభాలు కింద భాగంలో ఉన్నందున వాటిని తొలగించేందుకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు., వినియోగదారులు సహకరించాలని కోరారు.

అందుబాటులో ఆరోగ్య శ్రీ సేవలు



సేవలను ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్‌రెడ్డి

ఆదోని సెంట్రల్: పట్టణంలో ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మధు హాస్పటల్‌లో ఆరోగ్య శ్రీ సేవల కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆదోనిలో అరోగ్య శ్రీ సేవలు లేక ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూర్, పత్తికొండ ప్రాంతాలకు చెందిన వారు కర్నూలు,హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లేవారన్నారు. అందుబాటులోకి వచ్చిన ఆరోగ్య శ్రీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పురపాలక చైర్‌పర్సన్ శాంత, గురురెడ్డి, డాక్టరు మధు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడండి



రైతులకు ఎరువుల కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్ : రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పెద్దహరివాణం, బైచిగేరి, ఆరేకల్ గ్రామాలకు చెందిన 82 మంది రైతులకు జీరో బడ్జెట్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయం కింద రూ.10 వేల విలువజేసే కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 16 రకాల విత్తనాలు జొన్న, కిచెన్‌గార్డెన్ కిట్లు, కందులు, కొర్ర, మినుములు, మూగులు, కట్టిజనుము, పొద్దుతిరుగుడు, జీలుగ, మొక్కజొన్న, జనుము, పిల్లిపెసర, సజ్జలు, రాగులు, ఉలువలు, వేరుశనగలు ఇలా రూ.10 వేల విలువజేసే 16 రకాల విత్తనాలను ప్రభుత్వం కేవలం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. త్వరలో మాంత్రికి, పెసలబండ, నాగనాథనహళ్లి గ్రామాల్లో కూడా ఈ పంటలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డీపీఎం చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్ అహ్మద్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఎంపీపీ బడాయి దానమ్మ పంపాపతి, ఏడీఏ గిరీష్‌కుమార్, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పెద్దహరివాణం సర్పంచ్ రాముడు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించేందుకు కృషి



ఎల్ఎల్‌సీ నీటని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : గంగవరం డిస్ట్రిబ్యూటర్ కింద చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎల్లెల్సీ నుంచి గంగవరం డిస్ట్రిబూటర్ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. ముందుగా గంగమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గంగవరం డిస్ట్రిబ్యూటర్ కాలువల కింద పెద్దకడబూరు మండలంలోని రాగిమాన్‌దొడ్డి, దొడ్డిమేకల, హెచ్.మురవణి, కంబదహాల్, మంత్రాలయం మండంలంలోని జగ్గాపురం, హాలహర్వి, చిలకలడోణ గ్రామాల వరకు నీరు సరఫరా అవుతుందన్నారు. ఇరిగేషన్ ఏఈ మణికంఠ, ఎల్లెల్సీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక డంపింగ్



నాగరకణ్వీ సమీపంలో ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచిన దృశ్యం

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని నాగరకణ్వీ గ్రామం వద్ద వేదావతి (హగరి) నది నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలించి డంప్ చేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన కొందరు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి నది నుంచి ఇసుకను తరలించి రెండు, మూడు చోట్ల నిల్వ ఉంచారు. నదికి వరద వస్తే ఇసుకకు డిమాండ్ పెరుగుతుంది. ఆ సమయంలో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో ఇసుకను డంప్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నది నుంచి హొళగుందకు ట్రాక్టర్ ఇసుక రూ.2,500 వరకు ఉంది. వర్షాకాలంలో డిమాండ్ పెరగనుండడంతో ట్రిప్పు రూ.4 వేల వరకు అమ్ముకునే అవకాశాలు ఉంటాయి. ఆదోని, ఆలూరు, ఇతర పట్టణాలకు అయితే ధర భారీగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. అక్రమంగా ఇసుకను తరలించి డంప్ చేసే వారిపై చర్యలు తీసుకుని భూగర్భ జలాలు అడుగంటకుండా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌ను వివరణ కోరగా నది పక్కన కొందరు ఇసుకను నిల్వ చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, పోలీసుల సహకారంతో తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రిప్ పద్ధతితో రైతులు అధిక ప్రయోజనం



డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారిణి ఇందిర

ఆలూరు: ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేసిన డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని హార్టికల్చర్ అధికారిణి ఇందిర సూచించారు. ఆమె సోమవారం ఆలూరు, హాలహర్వి, ఆస్పరి మండలాల్లో రైతులు డ్రిప్ ఇరిగేషన్ సామగ్రి వినియోగించుకునే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రిప్ సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, తీగ పంటలను సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించవచ్చని వివరించారు. పంటల సాగుపై గ్రామాల్లో రైతులకు ఆర్‌బీకే సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఆదోని రూరల్ : ప్రభుత్వం అందజేసే పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషిరెడ్డి అన్నారు. సోమవారం మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయం–1లో జగనన్న పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. పీఎంసీ చైర్మన్ ఉలిగప్ప, నాయకులు దొమ్మరి లక్ష్మన్న, వైద్యాధికారి ఎంఎల్‌హెచ్‌బీ సరిత, ఏఎన్ఎం ఝాన్సీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎంపిక చేశారు. పట్టణంలోని వివేకానంద పాఠశాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పీడీఎస్‌వై రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా రామకృష్ణ, కమిటీ సభ్యులుగా విరేష్, పవన్, కల్యాణ్‌ను నియమించారు. రాష్ట్ర నాయకుడు పి.దివాకర్, జిల్లా నాయకులు ఉస్మాన్, రమేష్,కిరణ్ పాల్గొన్నారు

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో జగనన్న కాలనీని ఈనెల 20వ తేదీన ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం హౌసింగ్ అధికారులతో కలిసి లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు 50 శాతం నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీలను ఎంపిక చేసి గృహ ప్రవేశాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మొదటి దశ కింద 199 ఇళ్లకుగాను 84 ఇళ్లు పూర్తయ్యాయని, వాటిని ప్రారంభించేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు దాసరి ఉముంబా, ఈరన్న, హౌసింగ్ అధికారులు ఈఈ ప్రభాకర్, డీఈ ఆదినారాయణ, విద్యుత్ శాఖ డీఈ సుధాకర్, ఏడీ రామకృష్ణ, ఏఈ నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

హొళగుంద: మండలంలో ఖాళీగా ఉన్న మూడు వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ సోమవారం తెలిపారు. సుళువాయి 7వ వార్డు, చిన్నహ్యాట 9, మద్దిలింగదహళ్లి 3వ వార్డు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ స్థానాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా.. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు, 11న పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న ఉపసంహరణ, అభ్యర్థుల ప్రకటన, 19న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని చెప్పారు.

లంపీస్కిన్ నివారణకు టీకాలు

హొళగుంద: మండల పరిధిలోని చిన్నహ్యాట గ్రామంలో సోమవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థ ఆధ్వర్యంలో విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ జిలాన్ పశువులకు లంపీస్కిన్ (ముద్ద చర్మం) వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంపీస్కిన్ వ్యాధి సోకిన పశువులు పాలివ్వవని, తీవ్ర అస్వస్థతకు గురవుతాయన్నారు. పుండ్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తెలెత్తి ఇబ్బందులు పడతాయన్నారు. వ్యాధి గురించి సందేహాలుంటే పశు వైద్యులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలన్నారు. సంస్థ ప్రతినిధి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



బాధితుడి సమస్యను ఆలకిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, వారు సంతృప్తి పడేలా పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ నూర్జహాన్, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్, బీసీ వెల్ఫేర్ లక్ష్మినారాయణ, డిప్యూటీ తహసీల్దార్‌లు కౌసర్‌భాను, వలీబాషా పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు



పట్టణ వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఏఎఫ్ ఫోర్స్, డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు

ఆదోనిఅర్బన్ : ప్రజలకు భద్రత కల్పించేందుకు, వారికి భరోసానిచ్చేందుకు బెటాలియన్–99 రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కవాతు నిర్వహించామని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. డీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి కోట్ల కూడలి, శ్రీనివాస్ భవన్, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పరిధిలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ బెటాలియన్–99 కమాండర్ బాగెల్ ఫోర్స్‌తో పట్టణంలోని సమస్యాత్మక ప్రదేశాల్ల తిరిగామని చెప్పారు. సీఐలు విక్రమసింహ, నరసింహరాజు, మంజునాథ్, ఎస్ఐలు జయశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైస్ ఎంపీపీ మృతి



నాగమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: మండల ఉపాధ్యక్షురాలు ఆవుల నాగమ్మ (70) అనారోగ్యంతో కర్నూలులో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడేవారు. శనివారం పరిస్థితి విషమించడంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. దుద్ది గ్రామానికి చెందిన నాగమ్మ సజ్జలగుడ్డం ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరపున రెండేళ్ల క్రితం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సోమవారం రాత్రి మండల నాయకులతో కలిసి దుద్ది గ్రామానికి చేరుకుని నివాళులర్పించికుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొడి పీర్ల ఉత్సవాలు



కోయనగర్ కాలనీలో కొలువైన కొడీ పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు అందిస్తున్న భక్తులు

ఆలూరు రూరల్/హాలహర్వి: నియోజకవర్గ వ్యాప్తంగా కొడి పీర్ల ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. సోమవారం ఆయా పీర్ల చావిడిల వద్ద పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం 5 గంటల నుంచి భక్తులు చెక్కర తులాభారం, గుడ్డలు, పూలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తమ ఇళ్ల ముందు ఊరేగింపుగా వెళ్తున్న దేవుళ్లకు పూజలు నిర్వహించారు. రాత్రి అగ్ని గుండం కాల్చారు. నేడు సాయంత్రం పీర్లు జలధికి వెళ్లడంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

విద్యార్థికి అభినందన

ఆస్పరి: స్థానిక విజేత ప్రైవేట్ స్కూల్లో 10వ తరగతి చదివిన ఆస్పరికి చెందిన ఆర్‌పీ జితేంద్రసింగ్ 586 మార్కులు సాధించడంతో ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటీలో సీటు పొందారు. ఈ సందర్భంగా సోమ వారం మండల రెవెన్యూ కార్యాలయంలో విద్యార్థి ఆర్‌పీ జితేంద్రసింగ్‌ను తహసీల్దార్ కుమారస్వామి, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, డీటీ గాయత్రీ, ఈఓఆర్‌డీ సూర్య నరసింహారెడ్డి, తదితరులు అభినందించారు. బాగా చదివి ఆస్పరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

హామీలు నెరవేర్చడంలో కేంద్రం విఫలం

ఆస్పరి: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. సోమవారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో సీపీఐ ఆలూరు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. రైతులు, విద్యార్థు లు, మహిళలు, కార్మికుల హక్కులను హరించే రీతిలో మూడు వినాశక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు నియోజకవర్గం సస్యశామలం కావాలంటే 8 టీఎంసీల సామర్థ్యంతో వేదావతి ప్రాజెక్టును నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆస్పరి మండలానికి సాగు, తాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9, 10వ తేదీలలో ఆస్పరిలో నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. సీపీఐ నాయకులు మద్దిలేటి శెట్టి, విరుపాక్షి, శివ, కాలప్ప, రాజశేఖర్, కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, అంజినయ్య పాల్గొన్నారు.